అప్పిచ్చి.. చదివించి.. కొలువిచ్చి!

బీవోబీ నుంచి 600 పీవోలు

పీజీ సర్టిఫికెట్ కోర్సుకి ఎంపిక చేసుకొని... దాన్ని పూర్తిచేయడానికి రుణం ఇచ్చి... ఆ తర్వాత ఉన్నత ఉద్యోగంలోకి తీసుకుంటాం అంటోంది బ్యాంక్ ఆఫ్ బరోడా. ఆరొందల పీవో పోస్టులకు ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో అభ్యర్థులను మొదట కోర్సులోకి తీసుకుంటుంది. విజయవంతంగా ఉద్యోగంలో చేరి రుణం తిరిగి చెల్లించినవారికి అయిదేళ్ల తర్వాత ఆ మొత్తాన్ని లాయల్టీ బోనస్‌గా వెనక్కి ఇచ్చేస్తుంది.

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా 600 పీవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. వీటికి ఎంపికైనవారు ముందుగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో పీజీ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేయాలి. ఆ తర్వాత స్కేల్ ఆఫీసర్ హోదాతో ఉద్యోగం లభిస్తుంది. ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పరీక్షలు, సైకోమెట్రిక్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సిలబస్ అంతా ఐబీపీఎస్ పీవో పరీక్షల మాదిరిగానే ఉంటుంది. పరీక్షలో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌లకు ప్రాధాన్యం కల్పించారు. తర్వాతి స్థానం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌దే. ఈ రెండు విభాగాల్లో ఎక్కువ స్కోర్ సాధించినవాళ్లు లక్ష్యాన్ని అందుకోవడం తేలికవుతుంది. తాజా గ్రాడ్యుయేట్లు ఈ పోస్టుల కోసం ప్రయత్నించవచ్చు.

ఆన్‌లైన్ పరీక్ష

రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగంలో 75 మార్కులకు 50 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఎకానమీ, బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో 40 ప్రశ్నలు వస్తాయి. వీటికి 40 మార్కులు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో 50 మార్కులకు 40 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలకు 35 మార్కులు. మొత్తం 165 ప్రశ్నలతో 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. దీంతోపాటు మరో యాభై మార్కులకు ఇంగ్లిష్‌లో డిస్క్రిప్టివ్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు 30 నిమిషాలు కేటాయించారు. లెటర్ రైటింగ్, ఎస్సేల నుంచి ఒక్కో ప్రశ్న చొప్పున వస్తాయి. అభ్యర్థులు ఆంగ్లంలో ఏ మేరకు రాయగలుగుతున్నారో పరిశీలిస్తారు. ఆబ్జెక్టివ్ పరీక్షలో అర్హత సాధిస్తేనే డిస్క్రిప్టివ్ ప్రశ్నపత్రం మూల్యాంకనం చేస్తారు.

అర్హత సాధించాలంటే

ప్రతి విభాగంలోనూ సెక్షనల్ కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు రావాలి. పరీక్ష రాసిన అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఈ కటాఫ్ మార్కులను బరోడా బ్యాంకు నిర్ణయిస్తుంది. అలాగే మొత్తం అన్ని విభాగాల్లోనూ కలిపి నిర్ణయించిన కటాఫ్ మార్కులనూ సాధించాలి. ఇలా సాధించినవారి డిస్క్రిప్టివ్ పేపర్‌ను మూల్యాంకనం చేస్తారు. ఇందులోనూ అర్హత సాధించడం తప్పనిసరి. ఇలా అర్హత సాధించినవారి జాబితా నుంచి ప్రతి కేటగిరీలోనూ ఉన్న ఖాళీలకు నాలుగు రెట్ల సంఖ్యలో అభ్యర్థులను తర్వాతి దశ అయిన గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, సైకోమెట్రిక్ టెస్టుకు ఎంపికచేస్తారు. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లోనూ కనీస అర్హత మార్కులు పొందితేనే తుది నియామకాలకు పరిగణనలోకి తీసుకుంటారు.

తుది నియామకం: ఆన్‌లైన్ రాతపరీక్ష (ఆబ్జెక్టివ్+డిస్క్రిప్టివ్), బృందచర్చ, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. సైకోమెట్రిక్ పరీక్షలో అర్హత సాధిస్తే సరిపోతుంది.

పీజీ సర్టిఫికెట్ కోర్సు

కోర్సుకు ఎంపికైనవాళ్లు బోధన, భోజనం, వసతి అన్నింటికీ కలిపి రూ.3.45 లక్షలు ఫీజుగా చెల్లించాలి. ఈ ఫీజును 8 శాతం వడ్డీకి అందించేలా బరోడా బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుంది. పీవోగా విధుల్లో చేరిన తర్వాత 84 నెలల్లో (ఈఎంఐ విధానం) రుణాన్ని చెల్లించవచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో అయిదేళ్లు పూర్తిచేసుకున్న వారికి లాయల్టీ బోనస్‌గా ఈ ఫీజు మొత్తం (రూ.3.45 లక్షలు) తిరిగి చెల్లిస్తారు. కోర్సు వ్యవధి 9 నెలలు. మణిపాల్ క్యాంపస్ బెంగళూరులో తరగతులు నిర్వహిస్తారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న వారికి మణిపాల్ యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. అవసరం అనుకుంటే ల్యాప్‌టాప్ కోసం అదనంగా రూ.35,000 వరకు లోన్ సౌకర్యం కల్పిస్తారు.

ఖాళీలు, అర్హతలు

మొత్తం ఖాళీలు: 600

వర్గాలవారీ ఖాళీల వివరాలు: ఎస్సీ 90, ఎస్టీ 45, ఓబీసీ 162, జనరల్ 303. ప్రతి విభాగంలోనూ 4 శాతం ఖాళీలను దివ్యాంగులకు కేటాయించారు.

విద్యార్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 50 శాతం మార్కులు) జులై 2, 2018 నాటికి డిగ్రీ పూర్తిచేసినవాళ్లే అర్హులు.

వయసు: జులై 2, 2018 నాటికి 20-28 ఏళ్లలోపు ఉండాలి. జులై 3, 1990 కంటే ముందు; జులై 2, 1998 తర్వాత జన్మించినవాళ్లు అనర్హులు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు ఉన్నాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు: జులై 2

హాల్ టికెట్ల లభ్యం: జులై 18 నుంచి

ఆన్‌లైన్ పరీక్ష: జులై 28

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.100; మిగిలిన అందరు అభ్యర్థులకు రూ.600

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: ఏపీలో అనంతపురం, చీరాల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

ఏ విభాగానికి ఎంత ప్రాధాన్యం?

రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగంలో ప్రతి ప్రశ్నకు ఒకటిన్నర మార్కు కేటాయించారు కాబట్టి ఈ విభాగంపై ఎక్కువ దృష్టి సారించాలి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ ప్రశ్నలకు సూత్రాలు, ఎలాంటి గణన ప్రక్రియ అవసరం లేదు. జవాబు తెలిస్తే వెంటనే గుర్తించడం సాధ్యమవుతుంది. వీటిని వీలైనంత తక్కువ సమయంలో ముగించుకుని మిగిలిన సమయాన్ని రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లకు కేటాయించాలి. క్యాఏలో ప్రతి ప్రశ్నకు ఒకటింపావు మార్కు ఉంటుంది. అయితే ఈ విభాగంలో జవాబు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టే కొన్ని ప్రశ్నలను చివర్లో సాధించాలి. రుణాత్మక మార్కులు ఉన్నాయి కాబట్టి తెలియని ప్రశ్నలను పూర్తిగా వదిలేయాలి. తర్వాత దశకు చేరుకోవాలంటే ప్రతి సెక్షన్‌లోనూ యాభై శాతం ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగేలా ఉండాలి. మొత్తం మీద అరవై శాతం మార్కులు సాధించినవారు విజేతలు కావడానికి అవకాశాలు ఉంటాయి. వీలైనంత వరకు అన్ని అంశాలనూ క్షుణ్ణంగా చదవాలి. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఎక్కువ సాధన చేయడం ద్వారా వేగం పెరుగుతుంది. పరీక్షకు పదిహేను రోజుల ముందు నుంచి రోజుకు కనీసం ఒక మాక్ టెస్టు రాయాలి. ఐబీపీఎస్ పీవో పాత ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే ప్రశ్నల సరళిపై కొంత అవగాహన పెరుగుతుంది.

విధుల్లో చేరిన తర్వాత!

విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులు మూడు నెలలపాటు ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో కొనసాగుతారు. అనంతరం జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ (స్కేల్-1 ఆఫీసర్) హోదా కేటాయిస్తారు. ఈ సమయంలో రూ.23,700 మూలవేతనంగా చెల్లిస్తారు. దీనికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్ఏతోపాటు పలు ఇతర ప్రయోజనాలు ఉంటాయి. అన్ని రకాల ప్రోత్సాహకాలు కలిపి ముంబై లాంటి నగరాల్లో రూ.8 లక్షల వార్షిక వేతనాన్ని అందుకోవచ్చు. ఉద్యోగంలోకి చేరిన తర్వాత కనీసం మూడేళ్లపాటు విధుల్లో కొనసాగడం తప్పనిసరి. గడువులోగా వైదొలిగితే వడ్డీతోసహా చెల్లించాల్సిన ఫీజు బకాయి, శిక్షణ ఖర్చుల నిమిత్తం మరో లక్ష వసూలు చేస్తారు. మూడేళ్ల అనంతరం వైదొలిగితే ఫీజు బకాయి చెల్లిస్తే సరిపోతుంది. స్కేల్ -1 ఆఫీసర్‌గా విధుల్లో చేరినవాళ్లు ప్రతిభ, సీనియారిటీ ప్రాతిపదికన మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, ఆపై హోదాలకు చేరుకుంటారు.

* * *

నోటీస్ బోర్డు

ఈసీఐఎల్, హైదరాబాద్

● ప్రభుత్వ ఉద్యోగాలు

సంస్థ: భారత అణుశక్తి విభాగానికి చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), హైదరాబాద్. **పోస్టులు:** జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితరాలు. **ఖాళీలు:** 14 **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ, సీఏ/ఐసీడబ్ల్యూఏ, అనుభవం. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ **ఆన్‌లైన్ దరఖాస్తు:** 20.06.2018 నుంచి 04.07.2018 వరకు. హార్డు కాపీలను పంపడానికి చివరి తేది: 16.07.2018. **వెబ్‌సైట్:** http://www.ecil.co.in/

ఐఐపీఈ, విశాఖపట్నంలో బీటెక్ ప్రోగ్రాములు

● ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) 2018-19 విద్యా సంవత్సరానికిగాను బీటెక్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. **కోర్సు:** బీటెక్ **కాల వ్యవధి:** నాలుగేళ్లు **సీట్ల సంఖ్య:** 100 **విభాగాలు:** పెట్రోలియం ఇంజినీరింగ్ (50), కెమికల్ ఇంజినీరింగ్ (50). **అర్హత:** కనీసం 75శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత. **ఎంపిక:** జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2018 ర్యాంకు ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.1000. **చివరి తేది:** 16.07.2018 http://iipe.ac.in/admissions/

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

సంస్థ: డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, వెంకటరామన్నగూడెం, తాడేపల్లిగూడెం దగ్గర, పశ్చిమ గోదావరి జిల్లా. **కోర్సులు:** 1) ఎంఎస్సీ (హార్టికల్చర్) (48 సీట్లు) **అర్హత:** హార్టికల్చర్‌లో బీఎస్సీ/ బీఎస్సీ (ఆనర్స్). 2) పీహెచ్‌డీ (హార్టికల్చర్) (12 సీట్లు) **అర్హత:** హార్టికల్చర్‌లో ఎంఎస్సీ. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **పరీక్ష తేది:** 2018 ఆగస్టు 07, 08. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరి తేది:** 17.07.2018 **వెబ్‌సైట్:** https://www.drysrhu.edu.in/

డైరెక్టరేట్ ఆఫ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్

● వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సంస్థ: ఐకార్-డైరెక్టరేట్ ఆఫ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్, ముక్తేశ్వర్ (ఉత్తరాఖండ్). **పోస్టులు:** యంగ్ ప్రొఫెషనల్, ఎస్ఆర్ఎఫ్ తదితర ప్రాజెక్ట్ పర్సనల్. **ఖాళీలు:** 46 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, నెట్, పీహెచ్‌డీ, అనుభవం. **ఇంటర్వ్యూ తేది:** 2018 జులై 16 నుంచి 18 వరకు. **వేదిక:** ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎఫ్ఎండీ, ఆర్గుల్ (ఐఐటీ క్యాంపస్ దగ్గర), జత్ని, ఖుర్దా, ఒడిశా-752050. www.pdfmd.ernet.in

ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ

ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్‌లో తాత్కాలిక టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ.

పోస్టు: టీచింగ్ అసోసియేట్(08 ఖాళీలు)

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ, బోధన అనుభవం. **ఇంటర్వ్యూ తేది:** 20.06.2018

వేదిక: కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్, చిన్మయ బాలనివాస్, ఎస్‌వీఎన్ కాలనీ, గుంటూరు. https://www.angrau.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు ●

* * *

ప్లాస్టిక్‌తో ఉద్యోగాల ప్యాకేజీ

మనం నిత్యం వినియోగించే వస్తువుల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ విభాగంలో నిపుణుల అవసరం కూడా అలాగే ఉంది. సంబంధిత కోర్సు పూర్తికాగానే ఉద్యోగం అందించే ప్లాస్టిక్ ఇంజినీరింగ్ యువతకు మంచి అవకాశం. ఈ కోర్సుల విశేషాలు చూద్దామా?

ప్లాస్టిక్, అనుబంధిత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తగిన సాంకేతిక శిక్షణ, సమర్థత కలిగిన అభ్యర్థులను తయారు చేసి, త్వరితగతిన వారిని పరిశ్రమల్లో ఉద్యోగం పొందటానికి వీలుగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను రూపొందించింది.

సిపెట్‌కు దేశవ్యాప్తంగా 32 కేంద్రాలున్నాయి. ఇందులో 5 ప్లాస్టిక్స్ టెక్నాలజీ కళాశాలలు, 24 నైపుణ్య, సాంకేతిక సహాయక కేంద్రాలు, 3 ఆధునిక పరిశోధన కేంద్రాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ, హైదరాబాద్‌లలో సిపెట్ కేంద్రాలున్నాయి.

వీటిలో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా సిపెట్-జేఈఈను నిర్వహిస్తున్నారు. దీనికి ఆన్‌లైన్‌లోనూ (http://eadmission.cipet.gov.in) దరఖాస్తు చేయాలి. జులై ఒకటో తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. జేఈఈకి హాజరయ్యేవారు మూడు కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వీటిల్లో తమకు దగ్గరగా ఉన్న కేంద్రంలో పరీక్ష రాసుకోవచ్చు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 60 ఇస్తారు. పరీక్షా సమయం గంట.

ఏయే కోర్సులు?

విజయవాడ సిపెట్ మూడు రకాల కోర్సులను అందిస్తోంది.

1) పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రొసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ): ఏడాదిన్నర కోర్సు ఇది. బీఎస్సీ (ఒక సబ్జెక్టు రసాయనశాస్త్రంతో మూడేళ్ల డిగ్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

2) డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ): మూడేళ్ల కోర్సు ఇది. పదోతరగతి ఉత్తీర్ణత పొందినవారు అర్హులు.

3) డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ): మూడేళ్ల కోర్సు. పదోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులు.

ఒక్కో కోర్సులో 60 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత రెండేళ్లు విద్యార్థుల నుంచి స్పందన తక్కువగా ఉండడం, కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాల కావడంతో ఎలాంటి పరీక్ష లేకుండానే ప్రవేశాలు కల్పించారు. ఈ ఏడాది మొదటిసారిగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నారు. ఇక్కడ అభ్యర్థులు తక్కువగా ఉన్నందున పుణె, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ్ బంగ, ఒడిషా, గుజరాత్ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడ ప్రవేశాలు పొందారు.

హైదరాబాద్ సిపెట్‌లో పై మూడిటితోపాటు ఇంకో రెండు కోర్సులున్నాయి.

1) పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్ (పీజీడీ–పీటీక్యూసీ): ఏడాదిన్నర కోర్సు. బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథ్స్‌లతోపాటు కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

2) పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/ క్యామ్ (పీడీ–పీఎండీ విత్ క్యాడ్ /క్యామ్): ఏడాదిన్నర కోర్సు. మూడేళ్ల డిప్లొమా ఉన్నవారు అర్హులు. వివరాలకు సిపెట్ వెబ్‌సైట్ చూడవచ్చు.

- **సిపెట్ జేఈఈ–2018 దరఖాస్తు సమర్పణకు చివరి గడువు:** జూన్ 27
- **దేశవ్యాప్తంగా ప్రవేశపరీక్ష:** జులై 1
- **ఫలితాలు:** జులై 3
- **కౌన్సెలింగ్, ప్రవేశాల కాల్ లెటర్లు:** జులై 9 నుంచి
- **తరగతులు:** ఆగస్టు 1 నుంచి

బీటెక్, పీజీ కోర్సులు..

ప్లాస్టిక్ ఇంజినీరింగ్, పాలిమర్ అండ్ నానో టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్, ఇంజినీరింగ్ పాలిమర్ సైన్స్, బయోపాలిమర్ సైన్స్‌లలో ఎంటెక్, ఎంఈ, ఎమ్మెస్సీ, బీటెక్ కోర్సులు చేయాలనుకుంటే సిపెట్ హై లెర్నింగ్ సెంటర్స్‌గా పేర్కొనే భువనేశ్వర్, కొచ్చి, లఖ్‌నవూ, చెన్నై, అహ్మదాబాద్‌లలో మాత్రమే చదవాల్సి ఉంటుంది. ఆయా రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు జూన్- ఆగస్టుల మధ్య నిర్వహించే పరీక్షలు రాయడం ద్వారా వీటిల్లో ప్రవేశాలు పొందవచ్చు.

వేతనాలు..

ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసినవారికి ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనాలు లభిస్తున్నాయి. ఆ తర్వాత అనుభవం ఆధారంగా వేతనాలు పెరిగే అవకాశం ఉంది. విజయవాడలో సిపెట్‌లో పీజీడీ-పీపీటీ చదివిన 24 మంది విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోనే ఉద్యోగాలు లభించాయి.

- ***ఎం. శ్రీనివాసరావు,*** ఈనాడు, అమరావతి ●

ఉద్యోగావకాశాలకు కొదవ లేదు



- ***ఏవీఆర్ కృష్ణ,*** సంచాలకులు, సిపెట్, హైదరాబాద్

సిపెట్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైనవారి నుంచి డిప్లొమా, బీఎస్‌సీ పాసైన వారికి డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సాధారణ కోర్సులకు భిన్నంగా పాఠాల బోధనతోపాటు ప్రాక్టికల్స్ అధికంగా ఉంటాయి. అందుకు పూర్తిస్థాయి ప్రయోగశాలలు, పరికరాలు ఉన్నాయి. వివిధ ప్లాస్టిక్ వస్తువుల నాణ్యతను ధ్రువీకరించి ధ్రువపత్రాలు ఇచ్చేది సిపెట్ సంస్థే! అందువల్ల విద్యార్థులు బాగా నేర్చుకోవడానికి అవకాశం ఉంది. పరిశ్రమల్లో కూడా స్వయంగా పనిచేస్తూ నేర్చుకుంటారు. అందువల్ల ఉద్యోగావకాశాలకు కొదవ లేదు. వివిధ కంపెనీలు ప్రాంగణ నియామకాల కోసం సిపెట్‌కు వస్తాయి. ప్లాస్టిక్ పరిశ్రమ వృద్ధి ఏటా పెరుగుతోంది. ప్లాస్టిక్ అంటే కవర్లు, గ్లాసులు కాదు. ఇప్పుడు ప్లాస్టిక్‌ను ఉపయోగించని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ సంస్థలోని సీట్లలో 80 శాతం తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు కేటాయిస్తాం. ఇంకా అధికంగా ఉంటే తెలుగు విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తాం. పరిశ్రమల నుంచి అధిక గిరాకీ ఉన్నందునే గత ఏడాది కంటే ఈసారి కొన్ని కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచాం. అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తాం. వివరాలకు హైదరాబాద్ చర్లపల్లిలోని సిపెట్ సంస్థలో సంప్రదించవచ్చు.

భవిష్యత్తు బాగుంటుంది

- ***వి. కిరణ్‌కుమార్,***

సంచాలకులు, సిపెట్, విజయవాడ

సిపెట్ కోర్సులు పూర్తికాగానే వెంటనే ఉద్యోగాలు లభిస్తున్నాయి. మొదట్లో కొంత తక్కువ వేతనాలున్నా భవిష్యత్తు బాగుంటుంది. ప్రస్తుతం ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కష్టపడేతత్వం ఉంటే చదువుకున్న, నేర్చుకున్న అంశాల ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవచ్చు. అనుభవం ఉన్నవారికి విదేశాల్లోనూ ఉద్యోగాలు లభిస్తాయి. దక్షిణాఫ్రికా, దుబాయ్, సౌది అరేబియా, ఫిలిప్పీన్స్ దేశాల్లోనూ మంచి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ●

డిప్లొమా బాటలో వ్యవసాయ డిగ్రీ!

ఎంసెట్‌లో 10 వేల లోపు ర్యాంకులు సాధించినా లభించని వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల సీట్లు తక్కువ పోటీతో సాధించుకునే సదవకాశం ఆయా కోర్సుల్లో డిప్లొమాల ద్వారా సాధ్యమవుతోంది. ఈ డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు ఎంసెట్‌తో సంబంధం లేకుండా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల్లో నేరుగా డిగ్రీలోకి ప్రవేశించవచ్చు!

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు కళాశాలల్లో లభించే సీట్లలో 15 శాతాన్ని డిప్లొమా విద్యార్థుల కోసం కేటాయిస్తున్నాయి. గత ఏడాది నుంచి విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా అనుమతించిన ప్రైవేటు వ్యవసాయ కళాశాలల్లో సైతం సీట్లు కేటాయించడంతో విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి. ఆయా విశ్వవిద్యాలయాలు ప్రత్యేక ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి వ్యవసాయ, ఉద్యాన శాస్త్ర డిగ్రీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిప్లొమా కోర్సులు పూర్తి చేసినవారి కోసం అగ్రిసెట్ ప్రకటన విడుదలయ్యింది. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన డిప్లొమా పూర్తిచేసినవారి కోసం హార్టీసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతోంది.

అగ్రి సెట్- 2018

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిసెట్-2018 ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని వ్యవసాయ కళాశాలల్లో 112 సీట్లు అందుబాటులో ఉండగా (వ్యవసాయ డిప్లొమా 97, విత్తన పరిజ్ఞాన డిప్లొమాకు 13, సేంద్రియ వ్యవసాయం డిప్లొమాకు రెండు), వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 72 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు అవకాశం కల్పించారు.

తిరుపతి, బాపట్ల, నైరా వ్యవసాయ కళాశాలల్లో జులై 29న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు నిర్ణీత రుసుములు చెల్లించిన రశీదుతో కూడిన దరఖాస్తును కన్వీనర్, అగ్రిసెట్-2018, ఆఫీస్ ఆఫ్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి- 517502 అనే చిరునామాకు పంపాల్సి ఉంటుంది.

అగ్రిసెట్‌లో ఉత్తీర్ణులైన, అర్హులైన అభ్యర్థులకు నాలుగు సంవత్సరాల వ్యవసాయశాస్త్ర డిగ్రీలోకి ప్రవేశం కల్పిస్తారు. అగ్రిసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. ఓఎంఆర్ పత్రంలో గంటన్నర సమయంలో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఈ సెట్‌కు సిద్ధం అవుతున్న విద్యార్థులకు ప్రత్యేకించి సిలబస్ ఏమీ లేదు. డిప్లొమాలో ఉన్న కోర్సుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అన్ని సబ్జెక్టులనూ క్షుణ్ణంగా చదివితే చాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అగ్రానమీ, వృక్ష ప్రజనన శాస్త్రం, మృత్తికాశాస్త్రం, కీటకశాస్త్రం, తెగుళ్ల శాస్త్రం, ఉద్యాన శాస్త్రం వంటి కష్టమైన సబ్జెక్టులపై బాగా అవగాహన పెంపొందించుకుంటే మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది సుమారు ఐదు వేల మంది అగ్రిసెట్‌కు దరఖాస్తు చేసే అవకాశముంది.

హార్టీ సెట్- 2018

పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం హార్టీసెట్ 2018 ప్రకటనను విడుదల చేసింది. ఉద్యాన శాస్త్రంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు, ప్రస్తుతం రెండో సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని నిర్ణీత రుసుములు చెల్లించి పూర్తిచేసిన దరఖాస్తును, రుసుము చెల్లింపు రశీదును జత చేసి రిజిస్ట్రార్, వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట్రామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా- 534101 అనే చిరునామాకు పోస్టు ద్వారా, వ్యక్తిగతంగా చేర్చాల్సి ఉంటుంది.

జులై 18న విశ్వవిద్యాలయ కేంద్రమైన వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. తెలుగు మాధ్యమంలో 200 బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. రెండు గంటల సమయంలో ఓఎంఆర్ సమాధానం పత్రం ద్వారా సమాధానాలు గుర్తించాలి. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉద్యానశాస్త్ర డిగ్రీలో డిప్లొమా అభ్యర్థుల కోసం 83 సీట్లు కేటాయించారు. డిప్లొమా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే పరీక్షలో ఉండడంతో అన్ని సబ్జెక్టులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది రెండు నుంచి మూడు వేల దరఖాస్తులు అందవచ్చని అధికారులు భావిస్తున్నారు.

– పసుపులేటి వేణుగోపాల్,
న్యూస్‌టుడే, తిరుపతి

ప్రత్యేక కోర్సుల్లోకి ప్రవేశ పరీక్ష

చెవిటి, మూగ, అంధత్వం ఉన్న దివ్యాంగులకూ, మానసిక వికాసం సరిగా లేని పిల్లలకు ప్రత్యేక అవసరాలు ఉంటాయి. వాటిని గుర్తించి తగిన మద్దతు ఇస్తే వారూ చదువుల్లో రాణించగలుగుతారు. అయితే ఆ దివ్యాంగులకు సేవలు, బోధన చేసేవారికి కొన్ని నైపుణ్యాలు ఉండాలి. వాటిని పొందాలంటే వారు కొన్ని కోర్సులు చేయాలి. ఆ కోర్సుల్లో చేరడానికి జాతీయస్థాయిలో ఒక ఉమ్మడి పరీక్ష ఉంది. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి పలు ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

దివ్యాంగులకు ప్రత్యేకంగా బోధన, సేవలు అందించడానికి రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరిధిలో దేశవ్యాప్తంగా 450 సంస్థలు ఉన్నా వీటిలో ఏడాది వ్యవధితో సర్టిఫికెట్ కోర్సులు, రెండేళ్ల డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. దాదాపు 17,500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి అఖిల భారత స్థాయిలో పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్ విద్యార్హతతో ఈ కోర్సులకు పోటీ పడవచ్చు. డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ సహా పలు కోర్సుల్లో చేరవచ్చు. కోర్సులు పూర్తి చేసినవారు జాతీయ సంస్థలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పునరావాస కేంద్రాలు, ఎన్జీవోలు మొదలైనవాటిలో ఉద్యోగాలు పొందవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో చాలా సంస్థల్లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆ వివరాలు చూద్దాం...

ఇవీ కోర్సులు

- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్
- డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపయిరిమెంట్)
- డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (మెంటల్ రిటార్డేషన్)
- డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్: ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్ / సెరిబ్రల్ పాల్సీ / డెఫ్ బ్లైండ్/ హియరింగ్ ఇంపయిరిమెంట్ / మల్టిపుల్ డిజెబిలిటీస్ / మెంటల్ రిటార్డేషన్/ జువల్ ఇంపయిరిమెంట్ /
- డిప్లొమా ఇన్ ాయరింగ్ ఎయిడ్ రిపయిర్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ హిం గ్వేజ్ అండ్ స్పీచ్
- డిప్లొమా ఇన్ లాంగ్వేజ్ అండ్ ఇంటర్‌ప్రెటేష ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్
- డి రిహాబిలిటేషన్ థెరపీ
- డిప్లొమా ల్ రిహాబిలిటేషన్ (మెంటల్ రిటార్డేషన్)
- డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ (విజువల్ ఇంపయిరిమెంట్)

పరీక్ష ఇలా...

వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. అన్ని ప్రశ్నలూ ఆబ్జెక్టివ్ తరహాలోనే అడుగుతారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ ఒక్కో విభాగం నుంచి 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. హైస్కూల్ స్థాయిలో ప్రశ్నపత్రం ఉంటుంది.

అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత

ఆన్‌లైన్ దరఖాస్తులు: జూన్ 20 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు **దరఖాస్తు ఫీజు:** రూ. 500

అడ్మిట్ కార్డులు: జూన్ 25 నుంచి లభిస్తాయి.

పరీక్ష తేదీ: జూన్ 30 **ఫలితాలు:** జులై 5న ప్రకటిస్తారు. www.rehabcouncil.nic.in